# సంధ్యవెలుగు

రచన: మర్కాని బాబూరావు.

త్రెల తెలవారుతున్నది. చలిచలిగావుంది. దూరపు ఆకసపు అంచుల చీకట్లలోంచి వింతగా వెలుగు విస్తరిస్తోంది: ఆ ప్రకృతి రామణీయక దృశ్యంలో సంక్రాంతి వెలుగు వో వింత అందాన్ని చేకూర్చుకొన్నది.

గ్రామసీమ వీధులన్నీ నున్నగా అద్దంలా మెఱుస్తున్నాయ్. సంక్రాంతి ముగ్గులలో చిఱునవ్వులొలకపోసుకొంటున్నాయ్. సున్నంవేసిన ఆ తెల్లని ఇంటి గోడలు మంచులో విలీనమైపోయినయ్. ఇంటి శిఖరాలు, గడ్డివాములు ఆ పొగమంచులో తెల్లని కాగితముమీద చదరంగపు గళ్లులావున్నయ్. అక్కడక్కడ దృశ్యమంతా క్రొంగొత్త అందాలతో అలరారిపోతూన్నది.

తొలికోడి 'కొక్కొరొకో' కూతలు యింకా వినిపిస్తూనేవున్నాయ్. సంక్రాంతి స్నానాలు (తలంటి స్నానాలు) చేసి సరిక్రొత్తబట్టలు తొడుక్కొని పిల్లలందరూ చలిమంటచుట్టూ చేరుతున్నారు. పుట్టినిండ్లకు తిరిగివచ్చిన క్రొత్తపెళ్లికూతుళ్లు తమతమ యిండ్లముందు రమణీయంగా రంగవల్లికలను చిత్రిస్తున్నారు. క్రొత్తల్లుళ్లు గదికిటికీల్లోంచి ఆ దృశ్యాల్ని చూస్తూ ఆనందిస్తున్నారు. పొగమంచుల్ని తఱుముతూన్న చలిమంటల్ని చూస్తూ ఆనందిస్తున్నారు. దూరంనుంచి సన్నగా వినవచ్చే 'కొక్కొరొకో' కూతల్ని—మందంగా వీచే వాయుపవనాల్ని—ప్రాతఃకాల గ్రామసంకీర్తనను ఆస్వాదిస్తూ కూర్చున్నారు.

ముసలి నరసయ్య శాలువ కప్పుకొనివచ్చి చలిమంటవద్ద కూర్చున్నాడు. పొగలు వదుల్తూ కూర్చున్నాడు. చలిమంటలోంచి ఓ పుడకతీసి చుట్ట అంటించాడు, పొగలు వదుల్తూ కూర్చున్నాడు. చలికాచుకొంటూ గోపీరామస్వామి నరసయ్యను పలుకరించాడు "ఏం—ఈ పొద్దు పెందలాడే లేచావ్?".

..................

వరుసగా యించుమించు అదే వయస్సుగల వాళ్లు నల్గురూవచ్చి చలికాచుకొంటూకూర్చున్నారు. నల్గురు స్నేహితు లొకచోటచేరితే యిహ బాతాఖానీ కేమిలోటు వుంటుంది!

వాళ్లంతా బాతాఖానీలోకి దిగారు. కాని; నరసయ్య మెదలకుండా కూర్చున్నాడు మౌనంగా. అదిచూచి గోపీరామస్వామి 'ఏమిరా నరసయ్యా, అలా ఆలోచిస్తూకూర్చున్నా వేం సంగతి' అన్నాడు.

"ఏమీ తోచటంలేదు. ఎవరో ఒకరు ఓ చక్కని కథ చెప్పండి" అని అడిగాడు నారాయుడు.

"అవంతు నీదేరా నరసయ్యా" అన్నాడు గోపీరామస్వామి.

'కథ' అనే మాట వినేసరికల్లా ఆడుకొనే పిల్లలంతా పరుగెత్తుకువచ్చి చుట్టూ కూర్చున్నారు. "తాతా—తొందరగా మొదలుపెట్టు తాతా" అంటూ ఒత్తిడి చేయసాగారు.

నరసయ్య గొంతు సరిచేసుకొని మొదలుపెట్టాడు "కథకాదు గానీ—జరిగిన కథే...... ఈ గ్రామంలో నే—"

"ఊ—"

"—జరిగిన కథే అట అది."

నరసయ్య అల్లుడు కొంచం చలాకీమనిషి. కలివిడిగొట్టుగా పెద్దలతో, చిన్నలతో తగురీతిని సంచరిస్తాడు. అతగాడు మరో నల్గురు క్రొత్త అల్లుళ్లను

వెంటవేసుకొనివచ్చి చలిమంట దగ్గర బైటాయించాడు, "చాలా పెద్దమంట వేసారే" అంటూ.

సింహాచలం నవ్వుతూ "గ్రామం అల్లులందరూ వేంచేసినప్పుడు ఆమాత్రం మంటలేకపోతే ఎట్లా" అన్నాడు.

రెండు మూడు నిముషాలు ఆగి నరసయ్య అల్లుడు అక్కడున్న పలితకేశుల్ని సంబోధిస్తూ "ఏమండీ—ఇక్కడ నాకొక విషయం క్రొత్తగా కనిపిస్తూన్నది. అదేమంటే—ఇలా చూశారూ—ఈ గ్రామంలో ఇన్ని తాటిచెట్లున్నా కల్లుగీత ఎవ్వరూ గీయరేమి? ఈ గ్రామంలో గీతవృత్తిగా గల వాళ్లెవరూ లేనట్టున్నారే" అన్నాడు ప్రశ్నార్థకంగా.

"అదంతా ఓ విషాద సంఘటనలే బాబు" అన్నాడు బరువుగా గోపీరామస్వామి.

"అలాగు కాదండి. ఇందులో ఏదో మహత్తర విషయం అంతర్లీనమై వున్నట్టు గోచరిస్తోంది. ఆ సంగతి చెప్పినట్లయితే ఎంతో సంతోషిస్తాం" అన్నాడు నరసయ్య అల్లుడు ఎంతో ఉత్సాహంతో.

నరసయ్య గట్టిగా గొంతు సరిచేసుకొని కథ మొదలుపెట్టాడు—

ఇంతలో గుమ్మంలో నుంచుని నరసయ్య భార్య కేక పెట్టింది "యేమండోయ్!"

సరే! ఈ పూటకు వీలుపడదు. సాయంత్రం అలా ఊరివెలుపల ఇసుక తిన్నెలమీదకూర్చుని చెప్పుకొందాములెండి అంటూ లేచాడు నరసయ్య.


* * *

సాయం సమయము. ఊరిబయలు. గాలితరగల సంస్పర్శలోని హాయి. సాంధ్యారాగపు మార్దవము. ప్రకృతి రామణీయకత. ఎంతో ఉల్లాసము. ఊపు. ప్రొద్దున్న చలిమంట దగ్గర వున్నవాళ్లందరూ వచ్చి కూర్చున్నారు ఇసుకతిన్నెలమీద. ఒక్కరు మాత్రం రాలేదు. నారాయుడు నెమ్మదిగా ప్రశ్నించాడు "ఏమిరా—నరసయ్యా! మీ అల్లుడు యెక్కడ?"

నరసయ్య ముఖంలో ఏమీ మార్పురాలేదు. అతడు భావగర్భితంగా ఓ చిరునవ్వు నవ్వి ఊరుకొన్నాడు. తనకు సంబంధించిన విషయం కానట్టుగా కూర్చున్నాడు.

నారాయుడి అల్లుడు, తన సహచరుడ్ని గుఱించి సిగ్గుతో తలవంచుకొని "అ—ఏమున్నది? రిస్టువాచీ—బంగారు చైన్ ఇవ్వలేదని అలిగి భోజనం కూడ చెయ్యకుండా వెళ్ళిపోయాడు" అన్నాడు.

సింహాచలం పగలబడినవ్వాడు. "భలే సామ్యవాది, పీడింపు అనేది వుండకూడదన్నాడు గదూ ప్రొద్దున్న".



నెమ్మదిగా నరసయ్య కథ మొదలు పెట్టాడు. "సరిగా ఇటువంటి సంధ్యవెలుగులోనే గోవిందయ్య అస్తమించాడు.—"

అంతా నరసయ్యవంక తిరిగారు. శ్రద్ధగా వినేందుకు సర్దుకు కూర్చున్నారు.

"అవునవును. ఇటువంటి సంధ్యకాంతిలోనే కోదండయ్య పెళ్లానికి శిక్ష విధించాడు." అన్నాడు గోపీరామస్వామి.

"నిజం. శిక్ష—అద్భుతమైన శిక్ష" నిట్టూర్చాడు నరసయ్య.

దిగ్భ్రాంతులై వింటూన్నారా యువకులు.

నరసయ్య తిరిగి మొదలు పెట్టాడు. "ఈ గ్రామంలో నివసిస్తూండేవారు గోవిందయ్య—కోదండయ్య. ఇద్దరూ చిన్ననాటినుండీ ఇరుగు పొరుగువారు. నిజానికి వారు సొంత అన్నదమ్ముల్లా వుండేవారు. ఒక్కగర్భాన జన్మించిన సోదరులు కూడ అలా కలిసిమెలిసి వుండరేమో. వారిద్దరు ఒక్కచో ఆడుకొన్నారు. ఒక్కచోట పెరిగారు. పెద్దవారయ్యారు. వయస్సురాగానే కులవృత్తి 'కల్లుగీత' లోనికి దిగారు.

చల్దిబువ్వలు ఆరగించి ఇద్దరూ కబుర్లు చెప్పుకొంటూ గీతకు బయల్దేరేవారు. తాటితోపులు. దట్టంగా ఎత్తుగా పెరిగిన తాటితోపుల్లో ఇద్దరూ సరదాగా సంచరించేవారు. ఒకరికొకరు పోటీలుగా పందెములు వేసుకొంటూ కల్లుగీచేవారు. మధ్యాహ్నం ఇండ్లకు వచ్చేవారుకారు. ఆ తాటి తోపుల నీడల్లోనే విశ్రమించేవారు. గోవిందుని చిన్నకొడుకు అన్నంమూట తెచ్చేవాడు విస్తారమైన తాటి తోటకు. గోవింద కోదండు లిద్దరూ కలసి భోజనం చేసేవారు. కుర్రాడు చిలిపి గంతులువేస్తూ ఆ తాటితోటలో ఆడుకొనేవాడు. ఒకొక్కప్పుడు పొడుగాటి బెత్తంతీసుకొని బడిలో పంతులు కుర్రాళ్ళని అదమాయించినట్లు ఆ తాటి చెట్లను దండిస్తుండేవాడు. 'బెంచీ ఎక్కు'మని గదమాయిస్తుండేవాడు. ఆ అపరూపపు ఆటను, అందులో ఆ కుర్రాడనుభవించే అనుభూతిని చూసి ఆ ఇద్దరు గీతగాళ్లు నవ్వుకొనేవారు. ఆనందంతో తన్మయత చెందేవారు. ఈ నందనవనంలో మర్త్యలోక సుధను త్రావి దాహం తీర్చుకొనే—కాదు—హాయిసి, స్వర్గానుభూతిని అనుభవించే వివిధకుశ సంతానములు కిలకిలా రావములు చేసేవి. ప్రకృతి కై పెక్కేది. సాంద్రమైన ఆసహజ సంతోషనిధిలో వారు ముప్వురు గలగలలతో ఆడుకొనేవారు. ఆ చిన్న కుర్రాడి మురిపపు చేష్టలలో ఆ ఇరువురు పెద్దవాళ్లు విలీనమైపోయి వారూ చిన్న కుర్రాళ్ళలా గంతులువేస్తూ ఆడుకొనేవారు. తాటి తోపుల చివరవరకూ వచ్చి కుర్రాణ్ని దిగవిడిచేవారు వదలలేక వదలలేక. చిన్ని పాదాలకు ఆకు చెప్పులు తొడిగి, నెత్తికి గొడుగు కట్టుకు ఖాళీమూట తగిలించుకొని రాస్తామీదసాగి పోతూన్న కొడుకును చూపు మేరవరకు తిలకిస్తూండే వారిరువురూ. కోదండుడు, గోవిందుడి భుజంమీద తట్టి—"ఇహ పద" అనేవాడు.

కొంతసేపు ఆ తాటి నీడల్లో విశ్రమించేవారు. తాణా గంటలు 3 కొట్టిన తర్వాత తిరిగి గీత మొదలు పెట్టేవారు. సాయంకాలం పొలాల గట్ల వెంబడివస్తూ ఆ నీటి కాల్వలలో పీతల్నిపట్టి త్రాడుకు తోరణంలా వ్రేలాడగట్టి ఇంటికి తీసుకు పోయేవారు.

రాత్రులు వెన్నెలలో హాయిగా కబుర్లు చెప్పుకొంటూ భోజనములు పూర్తి చేసేవారు.

వారిలో అగుపించే అతి విచిత్రమైన సంగతి ఏమంటే వారిద్దరూ కల్లు వ్యాపారంలో మునిగి తేల్తూన్నా అంతవరకూ అలవడలేదు.

వారి జీవితాలు ఒడుదుడుకులు లేకుండా హాయిగా సాగిపోతున్నవి. సంసార జీవితాల్లోని మధువును, మాధుర్యాన్ని, ఆహ్లాదాన్ని తనివితీరా అనుభవిస్తూన్నారు. గోవిందు కోదండుల భార్యలిరు

వురూ వారిలానే ఎంతో సాత్త్వికులు. లక్ష్మీ సరస్వతులు వారికి తగిన పేర్లు. నిజానికి లక్ష్మీ సరస్వతులు అవతరించారేమో ననిపిస్తుంది.

కోదండునికి భార్య అంటే విలువకట్టలేనంత ప్రేమానురాగాలు. ఇంట్లో వున్నంతసేపూ చిలకా గోరింకల్లాగు కిలకిల మంటూ వుండేవారు.

కాని కాలం ఎప్పుడూ ఒకేగాడిలో నడుస్తే అందం వుండదనుకొంటుందేమో! పొడుగునా సుఖప్రయాణమే అయినట్టయితే విసుగ్గా కనిపిస్తుందేమో మరి! కష్టసుఖాలు, దూషణభూషణలు, ఖేదమోదములు, ఉచ్ఛ్వాస నిశ్వాసముల్లాగు లేనిదే అందము, అర్థము వుండదేమో !!

కాలప్రవాహం. కోదండుని పూరి గుడిసెలోని ఆనందజ్యోతిని ఆర్పివేసింది. ప్రేమవాహిని సరస్వతి మాయసంద్రంలో లీనమైపోయింది. కోదండుని హృదయం దుఃఖాగ్నిలో దగ్ధమైపోయింది.

కోదండునిలో పూర్తిమార్పువచ్చింది. ముఖమండలం విషాదమేఘములతో నిండిపోయింది. నిరుత్సాహంతో కూలిపోయాడు. నిష్పృహలకు లొంగిపోయాడు ...... దుఃఖోపశమనకోసం త్రాగుడు మొదలుపెట్టాడు. ఇరవైనాల్గు గంటలూ నిషాలోనే గడిపివేయుటం సాగించాడు.

ఎట్టిమార్పు!! ఒక స్వచ్ఛమైన అమాయక ఏలపాట జీవనుడు ఓస్వచ్ఛందమైన త్రాగుబోతుగా మారిపోయాడు.

కోదండుడు త్రాగినప్పుడు చాలా అపాయంగా ప్రవర్తించేవాడు. వాడికి మంచి, చెడ్డ... పెద్ద, చిన్న అనే విచక్షణలేకుండా పోయింది. వాడీభూమ్మీద అవతరించిన తర్వాత ఎదిరించి ఎరుగని గోవిందుణ్ని యీ త్రాగుడు మొదలుపెట్టిన తర్వాత ఏమాత్రము ఖాతరువుచేయడం లేదు. కల్లుగీతకు వెళ్లడం మానివేసాడు. అప్పుడప్పుడూ వెళ్లినా కొన్నిగంటలు పనిచేసిన తర్వాత తప్పత్రాగి చెట్లక్రింద పడిదొర్లేవాడు.

గోవిందుడు వాడి స్థితినిచూసి చాల ఖిన్నుడయ్యాడు. వాడిని బాగుచేయుట మేలాగునని ఎంతో ఆలోచనచేసాడు. భార్యతో ఏవో మంతనములు, సలహాలు కొనసాగించాడు...... చివఱకు రెండో పెండ్లిచేస్తే యేమైనా బాగుపడతాడని వాళ్లిద్దరూ నిర్ధారణకు వచ్చారు. వధువు కొఱకెంతో వ్యయప్రయాసలకులోనై వెతుక మొదలిడారు.''

నరసయ్య ఓ వేడినిట్టూర్పువిడిచి కథ అక్కడకు ఆపివేసాడు. సంధ్య వెలుగులో అందాల్ని చిదుముకొంటున్న ప్రకృతి రామణీయతలో అతని దృష్టుల్ని మునుకజేసాడు. ఏవో అనుభూతులలో విలీనుడై పోసాగాడు. అతని ముఖంలో దుఃఖం, ఆనందం, విచారం, సంతోషం, అన్నీ ఒక్కసారిగా ప్రతిఫలించినయ్.

సంధ్యవెలుగు క్రమంగా రాత్రిలో విలీనమై పోయింది. నరసయ్య నెమ్మదిగా అన్నాడు ''ఇవ్వాళికింతతో చాలించుదాం. రేపు తిరిగి సాయంకాలం కలుసుకొందాం, కథ పూర్తిచేస్తాను—మీ కిష్టమైతేనే సుమా.''

''ఇంకా నయం—ఇష్టం కాకపోవడమేమిటి ఎంతో ఆసక్తిగావుంటేను'' అన్నారు యువకులు.

అందరూ లేచి నెమ్మదిగా నడక సాగించారు. అంతా మౌనముద్రలో లీనమైపోయారు. సంధ్యవెలుగు—అందులోని నిగూఢతను, అనుభూతిని--వారిలో వుద్భవించిన వివిధానుభవాల్ని—దానికీ వారికథలో గల ప్రాముఖ్యాన్ని, అర్థాన్ని—ఆలోచించుకొంటూ వారివారి యిళ్ళకు చేరుకొన్నారు.

....................

మరునాడు సాయంకాలం అందరూ వచ్చి ఇసుక దిబ్బలమీద కూర్చున్నారు. నరసయ్య కథ మొదలుపెట్టారు.

వెతకి వెతకి నాంచారమ్మ అనే ఓ అమ్మాయిని ఎన్నుకొని కోదండునికి భార్యగా తీసుకువచ్చాడు. ఏలోటూ లేకుండా పెండ్లికార్యం ముగించాడు.—

నిజానికి నాంచారమ్మ నాంచారమ్మే. మహా గయ్యాళి. ఏమి మంత్రమున్నదో, ఏ శక్తివున్నదో కాని ఆమె ఎంత చెబితే అంత కోదండుడు. కూర్చోమంటే కూర్చుంటాడు. నిలమంటే నిలబడవలసినదే. అయినప్పటికీ తిక్కతిరిగినప్పుడు చిత్తుగా తన్నుతుండేవాడు కూడాను.

నాంచారమ్మ నోరు చాల దురుసు. ఎప్పుడూ ఏదో జరగడం లేనిదే ప్రొద్దుగడిచేది కాదు. మొగుడి మీద మూతి విరచటముగాని ప్రక్కనున్న గోవిందుడు పెళ్ళాం పిల్లలమీద మెటికలు విఱచుటగాని తఱచుగా జరుగుతుండేది.

కోదండునికి త్రాగుడు అతిఐపోయింది. ఒకదాని వెంటఒకటి వరుసగా చెడ్డలవాటులన్నీ చివఱకు చోరత్వంలోకి గూడ దిగాడు.

ఓనాడు పోలీసువాళ్లు కోదండుణ్ని మెత్తగా తన్ని వదిలిపెట్టారు. వాడు సరాసరి కల్లుపాకకు పోయి చిత్తుగా త్రాగి ఇల్లుచేరుకొన్నాడు. ఇంటికి వెళ్ళేసరికి పెళ్లాం నాంచారమ్మ ముసుగువేసి పండుకొన్నది. ఆకలితో నకనక లాడిపోతున్న కోదండుడు తిన్నగా వంటఇంట్లోకి వెళ్ళాడు. ఖాళీగిన్నెలు ఎదురుపడినయ్! అతని వళ్లు మఱ్ఱునున్నది అరికాలిమంట నెత్తికెక్కింది. దెబ్బలుతిన్న శరీరం జివ్వుమన్నది. ఆకలిప్రేవులు గుయ్‌మన్నాయి. ఆతడు రౌద్రమూర్తయిపోయాడు. కన్నులెఱ్ఱ పడినయ్. వళ్ళు తెలీలేదు. విసురుగా వెళ్లి మంచంమీద కూర్చుని 'ఏయ్—వంట ఏద్వలే' అన్నాడు.

నాంచారమ్మ ఏడుపు శృతి పెంచింది. గద్గద స్వరంతో 'బియ్యంలేవు' అన్నది.

కోపంతో విసుగ్గా 'బియ్యంలేవు. ఏడుస్తూ పండుకోపోతే గోవిందుడి ఇంట్లోతెచ్చి చావకపోయావ్' అన్నాడు.

'అలా వెళ్లబెట్టే అడ్డమైన మాటలు అనిపించుకో వలసి వచ్చింది: ఆడదాన్ని బట్టుకొని అలా తిడతాడు.—అసలు మనదగ్గర పౌరుషంవుంటేగా. ఆడది నయం——'అంటూ సణుగుడు మొదలు పెట్టింది. దాంతో కోదండునికి చివాలెత్తింది.

నాంచారమ్మ అభినయాని కసలు సంగతి ఏమంటే—అన్నం వండక పోవటం బియ్యం నిండుకొని కాదు. ఇంట్లో కొద్దిగా లేకపోలేదు. ఇహపోగా గోవిందుడి మీద కక్షసాధించేందుకు విసరిన అస్త్రం మాత్రమే. సంభాషణల సందర్భంలో గోవిందుడి భార్య లక్ష్మికి, నాంచారమ్మకు మాటామాటా వచ్చింది. నాంచారమ్మ నోరుదురుసు మనిషని తెలసిన సంగతే. ఒక్కమాటను సాగదీసి పాతిక మంటలతోగాని చులిపి వదలిపెట్టదు. లక్ష్మి తెలసివుండి తద్దినం తెచ్చుకొన్నా మెందుకని విసుక్కొని చేట నిండా బియ్యం పోసుకొని వడ్లనేరుతూ కూర్చుంది. చేతులు త్రిప్పుతూ అటూ ఇటూ తిరుగుతూ నాంచారమ్మ ఏమేమో అంటూనే ఉంది. అదే సమయంలో విసిగి వేసారి గోవిందుడు పనిలోంచి తిరిగివచ్చాడు. ఏమిటమ్మా—ఈ రాద్ధాంతం సరస్వతిని మఱపించుతావని తెచ్చుకొన్నందుకు మంచి బుద్ధే చెప్పుతున్నావ్. పేరుకు తగ్గ గుణాలుంటా యనుకోలేదు. ఎంతో పెద్దపెద్ద వూహాలతో వెతకి వెతకి తెచ్చుకొన్నాం.

నాంచారమ్మ మూతి త్రిప్పి, చేతులెగరవేస్తూ ఔర—ఔర — ఎటువంటి మాటలంటున్నావ్. నీకొంప కూలిపోనూ నీ జీవితం———అని సాగదీస్తోంది.

గోవిందుడా విపరీత ప్రవర్తనకు రౌద్రుడై 'జాగ్రత్త—మాటలు మీరావంటే చెప్పుదెబ్బలు తగుల్తాయ్. తండ్రిలా చూస్తూన్నందుకు ఎట్టిపని' అని పూర్తిచేయకుండానే అడ్డువచ్చి 'మహా బయల్దేరాడు మొగాడు. చెప్పుతో కొట్టాడట' అంటూ హేళనగా మాట్లాడింది. నాంచారమ్మ ఆ సమయంలోను గోవిందుడు కోపం ఆపుకోలేకపోయాడు. ఓ లెంప పెట్టుచరిచాడు. దాంతో నాంచారమ్మ గిర్రున తిరిగి ఇంట్లో దూరింది. చికాకైన మనస్సుతో గోవిందుడు నులక మంచం మీద పండుకొని చుట్టవెలిగిం

చాడు. చుట్టపొగను తెరలు తెరలుగా గాలిలోకి వదుల్తూ పూర్వపు సంగతులను క్రొత్త సంగతులకు గల తారతమ్యాల్ని పరిశోలిస్తూ వుండిపోయాడు.

—ఇదీ జరిగిన సంగతి. ఎలాగైనా కక్ష సాధించాలని తాను తిన్నదెబ్బ తిరిగి అతగాడికి వప్పగించవలెనని చాలా దీక్షపుట్టింది. దానికే ఈతంతు.

'—మనదగ్గర పౌరుషం వుంటేగా' అన్న మాట కోదండునికి కత్తిపోటులా తగిలింది. కల్లు వైపు జివ్వుమన్నది. 'ఏమిజరిగింది, తొందరగా చెప్పు ఊ—నా పౌరుషం చూద్దుగాని ఊ—చెప్పు' అని రెట్టించాడు.

నాంచారమ్మ అదును కనిపెట్టింది. ఇటువంటి సమయం దాటితే ఇహ ఉత్తదే అనుకొన్నది. నిజానికి అంతే. గోవిందుడిముందు కోదండుని ప్రవర్తన మన్నుదిన్న పాము సామెతే. మాటలతో ఎదిరించడమే అతి కష్టమైనప్పుడు చేయి చేసుకోవలెనంటే అతిశయోక్తిగాకేమున్నది. అంచేత నాంచారమ్మ చాల దొడ్డ ఆలోచనే చేసింది. చూరి అడుగున గూట్లో దాచిన సురాపానం తెచ్చింది. కోదండుడి ప్రక్కన కూర్చుని ఓచేత్తో ఆతడ్ని కౌగలించుకొని రెండోచేత్తో సురాపాత్రను అతని నోటిదగ్గర పెట్టి 'ముందు దాహం తీర్చుకో' మన్నది.

ఆ అపూర్వ ప్రేమమయ ప్రవర్తనకు కోదండుడు ఉబ్బి తబ్బిబ్బై పోయాడు. స్వర్గ లోకంలో వున్నట్టయిందాతనికి. ఆమెను 'ఏం జరిగింది' అని ప్రశ్నించాడు.

నాంచారమ్మ తన దగ్గరవున్న శక్తులన్నింటినీ కేంద్రీకరించింది. కండ్లనిండా నీరు నింపుకొన్నది, దాని కనుగుణంగా గొంతు బొంగురు పోయింది... లేనిపోని కల్లిబొల్లి మాటలు చెప్పింది. గోవిందుడి మీద బాగా ఈర్ష్యను, క్రోధాన్ని రగుల్కొల్పింది. అడ్డమైన తిట్లు తిట్టాడని, పరాయిస్త్రీ అనైనా లేకుండా చెంపదెబ్బకొట్టి జుత్తు పట్టుకుని ఇంట్లోకి ఈడ్చుకు వచ్చి పడవేసాడని చెప్పింది.......ఈ విధంగా చాడీలను ఇంధనములువేసి అతడి క్రోధాగ్నిని బాగా ఎక్కువ జేసింది.

ఇహ కోదండుడు కోదండు డనిపించలేదు. చరచరా బయటకు వచ్చి 'ఆడదాన్ని పట్టుకు చడామడా తిట్టి పైపెచ్చు కొట్తాడు—' అంటూంటే గోవిందుడికి కోపం వచ్చింది. 'చాల్లేవోయ్. ఆడదాని చాడీలు విని తెగ ప్రేలుతున్నావ్. మాటలు మీరక వెళ్ళు' అన్నాడు.

కోదండుని కా మాటలు హేళనచేసి నట్టనిపించింది. ఎంత చులకనగా మాట్లాడాడని వళ్లు మండింది. 'మాటలు మాత్రం జాగ్రత్తగా రానియ్' అంటూ ప్రక్కనున్న తునకాల బండ పుచ్చుకొని ముందడుగు వేసాడు. 'ఏంరా!—తప్ప త్రాగి—ఏమేమీ—ఒళ్లూపై తెలియకుండా కొట్టుకుంటున్నావ్.' అంటూ లేచి నుంచున్నాడు గోవిందుడు గాంభీర్యంగా.

అలాలేచి నుంచున్నాడో లేదో తునకాల బండ అతని శిరస్సుపై వేగంగా బలంగా పడింది. దాంతో మొదలు నఱికిన చెట్టులా కూలి పోయాడు. శిరస్సు పగిలి రక్తస్రవంతిలో శరీరమంతా తడిసి పోయింది ఆ రక్త ప్రవాహంలో గోవిందుడి మృతకళేబరము వికావికలై పడివుంది. గోవిందుడి భార్య ఆ భయంకర దృశ్యాన్ని చూసి అక్కడే కూలబడి పోయింది స్పృహతప్పి. కొడుకు భయపడి వెళ్లి పెట్టెల వెనకాల నక్కి కూర్చున్నాడు. ఆ కుర్రాడు తానే ప్రపంచంలో వున్నదికూడ అర్థంకానంత స్థితిలో పడిపోయాడు, కొయ్యబారిన మనస్సుతో.

రక్తస్రవంతి దర్శనంతో కోదండుని నిషా పూర్తిగా తొలగి పోయింది. అట్టి క్రూరమైనపని తన చేతులతో ఎట్లా చేసాడో ఆతనికే అర్థం కాలేదు. చలన విహీనుడై శిలా ప్రతిమలా నిలబడి పోయాడు.

ఏమి జరుగుతుందో అని తలుపు చాటునుండి తొంగి చూస్తూన్న నాంచారమ్మ తన భర్త తునకాల బండ పుచ్చుకొని ముందుకు వెళ్లటం

చూసి అతడ్ని నివారించేందుకు పరుగెత్తుకుని వెనకాల వచ్చింది. కాని ఆమె వెళ్లేలోపల జరుగవలసిన పనేమో జరిగిపోయింది. ఆమె అలా జర్గుతుందని ఎన్నడూ తలచలేదు. భర్త అంత ఘోరకార్యం చేస్తాడనుకోలేదు. మాటలతోగాని చేయి చేయి చేసుకోవడముతో తన కక్షతీరి పోతుందనుకొన్నది గాని ప్రాణాలకే ముప్పు కల్గుతుందనుకోలేదు.

ఆవిడ హృదయ కుహరంలో ఏ మూలనో దాగివున్న ప్రేమ. త్యాగం, కరుణ, రక్షణలు తొంగి చూసినయ్....చనిపోయిన మనిషి ఎలాను తిరిగిరాడు. తన భర్తను పోలీసులు తీసుకుపోతారు. ఉరిశిక్ష. బాబోయ్! ఎట్టి ఘోరశిక్ష. ఆమె చెవులు గింగురు లెత్తినయ్. పతిప్రేమ పొంగులు వారింది. అతని నెలానైనా రక్షించాలని తోచింది. ఎలా? అతని ప్రాణాలకొఱకు తన ప్రాణాలను బలిదానంచేయ నిశ్చయించింది. తానే గోవిందుని కొట్టి చంపేనని నేఱమంతా తనపై మోపుకొని భర్త ప్రాణాలకొఱకు త్యాగంచేయ నిశ్చయించుకొన్నది...అనాథలైన గోవిందుని భార్యాపుత్రులు జ్ఞప్తికి వచ్చారు. వారిపై జాలి, కరుణ కల్గింది. దిక్కులేని వారి జీవితాలకు ఆధార మెవరు? వారి కెవరు రక్షణ. తాను కోదండుడ్ని ఉరినుండి తప్పించినట్లయితే వారిని రక్షింపగలడు. వారిని పోషింపగలడు. కాబట్టి తాను చేయగల్గినది. ఆ ఒక్క పని మాత్రమే.—అందుకే శిలా ప్రతిమలా నిలబడిన భర్తవైపు తిరిగి 'పారిపో' మన్నది.

కాని—

ఇంతలో పోలీసులారీ వచ్చేసింది. కోదండుడ్ని లాక్కు వెళ్లిపోయారు. కోదండుడి మనస్సు పూర్తిగా చలించిపోయింది. మేఘాలు చెల్లాచెదరయిపోయేట్లు నవ్వసాగాడు పిచ్చివాడిలా.

ఓనాడు భర్తనుచూసేందుకు ఖైదుకు వెళ్ళింది నాంచారమ్మ, అది సంజవేళ. సంధ్య వెలుగు ఓవింత వాతావరణాన్ని సృష్టించుకొన్నట్లగుపించింది. ప్రకృతిలో ఓవిధమైన మాంద్యము, విషాదము విలయతాండవం చేస్తున్నట్టనిపించింది. నాంచారమ్మ ఖైదుకువెళ్ళి గది ఇనుపకటకటాల నానుకొని నుంచున్నది. కోదండుడువచ్చి ఆమె కెదురుగానిలబడ్డాడు. జరిగిన విషయాలన్నీ అతని బుర్రలో సుత్తికెత్తుకొని వున్నాయ్. ఆ బరువుతో అతని జుత్తు చిందరవందరయిపోయింది. బాకు మొనల్లాంటి తీక్షణమైన చూపులతో ఆమె శిరస్సునంతా కలయజూచాడు. ఇనుప కటకటాల్లోంచి రెండుచేతుల్ని పోనిచ్చి ఆమె గొంతు నులిమివేయ ప్రయత్నించాడు, చటుక్కున ఆపని ఆపివేసాడు. తిరిగి ఆమె ముఖంలోకి తీక్షణంగా చూస్తాడు. అతని తీక్షణ వీక్షణములు ఆమె నుదటిపై మెఱుస్తున్న తిలకంపై కేంద్రీకరింపబడినయ్. తల్లితర్వాత తల్లిలాంటి లక్ష్మి గుర్తుకొచ్చింది......సతీత్వమును గుర్తింపజేసే తిలకం— నాంచారమ్మ నుదుట మెఱుస్తున్న తిలకాన్ని తుడిచివేసాడు 'ఇదే నీకు తగినశిక్ష' అంటూ. 'ఇహ నీ ముఖం నాకు చూపకు. ఫో—ఫో—ఫో' మని శిలలు వ్రక్కలయ్యేట్టు అఱచాడు కండ్లకు చేయి అడ్డంపెట్టుకొని.

నాంచారమ్మ జీవచ్ఛవంలా నడచి వెళ్ళిపోయిందా సంజవెలుగులో."

నరసయ్య కథ పూర్తిచేసాడు.

"ఆహా—ఎటువంటి శిక్ష విధించాడు.' అన్నాడు నారాయుడి అల్లుడు.

"ఎన్నో చదువులు నేర్చి, శాస్త్రాలు తరించి, ప్రపంచంలోనికల్లా నాగరికుడినని ఛాతీవిఱచుకొని తిరిగేవాడుకూడా విధించలేనటువంటి శిక్షను విధించాడు విద్యాహీనుడైన కోదండుడు" గోపీరామస్వామి అల్లుడు తన అభిప్రాయం వెల్లడించాడు.

"ఆ సంజవెలుగులో ఎంత నిగూఢత, అర్థం వున్నది!" అన్నాడు సింహాద్రి అల్లుడు.

"అవును — సంధ్యవెలుగు—సంజవెలుగు" అన్నాడు బరువుగా నరసయ్య.

"ఆతర్వాత ఏమి జరిగింది?" ప్రశ్నించాడు సీతారాముడి అల్లుడు.

"ఆతర్వాత ఏమిజర్గుతుంది! గోవిందుడి భార్య మనోవ్యాధితో పిచ్చిదై పోయింది. ఆమెను, కుర్రాడిని వెంటబెట్టుగొని నాంచారమ్మ ఈ గ్రామంవదలి వెళ్ళిపోయింది. అక్కడ రెక్కల కష్టంచేసి వారిని పోషిస్తున్నది, కుర్రాడికి చదువు చెప్పిస్తున్నది. ఇప్పుడు వాడు ఎనిమిదోక్లాసు చదువుతున్నాడట. క్లాసులోకల్ల తెలివైనవాడట. ఫస్టుమార్కులన్నీ వాడివేనట. మొన్ననే నారాయుడు పనిమీద వారున్నవూరు వెళ్ళినప్పుడు వాళ్ళను చూసి వచ్చాడు. నాంచారమ్మ యిప్పుడు ఏపానీయపు మహిమవల్ల తమకట్టి కష్టస్థితి గల్గిందో బాగా గుర్తుపెట్టుకొని గాబోలు మధ్యనిషేదపు సంస్థలో పనిజేస్తోందట." అని నరసయ్య పూర్తిచేసి గట్టిగా ఓవేడి నిట్టూర్పు విడిచాడు. సంజవెలుగును తిలకిస్తూ కూర్చుండిపోయాడు.

మిగిలినవారి దృష్టులుకూడ వింత వెల్గులను ప్రతిఫలింపచేసుకొన్న ఆ సంజవెలుగుపై సారింపబడినయ్.

సంజవెలుగును తిలకిస్తూనే "ఇంతకూ యీవూళ్ళో కల్లుగీత లేకపోవటానికి కారణం చెప్పనే లేదు." అన్నాడు నారాయుడి అల్లుడు.

నారాయుడు అందుకొని "గోవిందుడు చనిపోయిన తర్వాత ఈవూళ్ళో ప్రజలు ఆవిషయం గురించి ఆలోచించారు. గోవింద కోదండుల జీవిత విశేషాల్ని విమర్శించికోసాగారు. కోదండుడిలోకల్గిన క్రూరబుద్ధికి కారణం త్రాగుడు. త్రాగుడువల్లకల్గే నష్టాలన్నీ లెఖ్ఖకట్టారు. చివరినష్టం ప్రాణహాని, ఖూనీ త్రాగుడు వల్ల సంసారాలు ఎలాపాడైపోతున్నాయి అమాయకులు ఎలా నానావస్థలకు గురియైపోతున్నారో—అన్నీ తర్జన భర్జనలు చేసారు. వంటికీ ఇంటికీ, గ్రామానికీ దేశానికీ—అన్నిటికీ మూలకారమైన మధ్యపానాన్ని నిషేధించారు. ఆనాడు మొదలుకొని ఈ గ్రామంలో కల్లుగీత మానివేసి మధ్యపాన నిషేధాన్ని మెలకువతో అమలు పరచేందుకు అందరూ అంగీకరించారు. అందరూ కలసి తాటిచెట్లనీడలో విశ్రాంతి తీసుకొంటూన్న గోవిందుని గోరీదగ్గరకు వెళ్ళి పైవిధంగా ప్రమాణం తీసుకొన్నారు." అని ముగించాడు.

* * *

ఆ ప్రదేశమంతా నిశ్శబ్దంతో నిండిపోయింది. అక్కడ కూర్చున్న వాళ్లంతా ఎవరికివారు తమ తమ ఊహాగానంలో పడిపోయారు.

దక్షిణ దిశవైపు ముఖంపెట్టి సంజవెలుగును నిరీక్షిస్తున్న నరసయ్య లేచి "మీరంతా ఇలారండి" అన్నాడు.

అక్కడున్న వారినందరినీ వెంటబెట్టుకొని దక్షిణదిశగా 50 గజాలు నడచివెళ్లాడు. అక్కడ తాటిచెట్లనీడలో విశ్రాంతితీసుకొంటూన్న గోవిందుని గోరీని తిలకించారు. తాటితోపుల సందులనుండి సంజవెలుగు వింతవింతగా పడుతూన్నదా గోరీమీద. ఆ సంజవెలుగులో గోరీ ఓ అపూర్వ కాంతితో మెఱసిపోతోంది. ఏవేవో మహత్తర భావాల్ని మానవహృదిలో మొలకలెత్తజేస్తోందా గోరీపైన వింతగా పడే సంజవెలుగు.

## నీతి వాక్యాలు

"బ్రహ్మదేవుడు మానవజాతిని ఆదివారాల్లో సృష్టించాడు"—మార్క్ ట్వెయిన్ ఉవాచ.

* * *

ఎప్పుడూ నోరుమూసుకుని నిశ్శబ్దంగావుండు—ఒకవేళ మాట్లాడవలసివస్తే విలువగలిగిన మాటల్నే మాట్లాడు.

* * *

అనుమానం ప్రవేశించే ద్వారంనుంచే ప్రేమ నిష్క్రమిస్తుంది.